## ఏపీలో ఓటర్ల
# జాబితా రెడీ

- ఏపీలో 4,02,21,450 ఓటర్లు
- ముసాయిదా జాబితా రిలీజ్‌చేసిన ఈసీ
- అభ్యంతరాలుంటే తెలిపాలన్న అధికారులు



రాష్ట్ర ఎన్నికల ప్రధానాధికారి ముఖేశ్ కుమార్ మీనా ముసాయిదా ఓటర్ల జాబితా2024ను విడుదల చేశారు. ముసాయిదా జాబితా ప్రకారం 4,02,21,450 మంది ఓటర్లున్నట్లు తేలింది. దీనిపై అభ్యంతరాలు, మార్పులు, చేర్పుల అనంతరం 2024 జనవరి 5వ తేదీన తుది జాబితాను విడుదల చేస్తారు. రాష్ట్రంలో పురుషులకంటే మహిళా ఓటర్లే అధికం! పురుష ఓటర్ల సంఖ్య 1,98,31,791 కాగా... మహిళా ఓటర్ల సంఖ్య 2,03,85,851. అంటే... పురుషులకంటే మహిళా ఓట్లు 6,17,458 ఎక్కువ. ఏపీలో ముసాయిదా ఓటర్ల జాబితాను ఎన్నికల సంఘం విడుదల చేసింది. ముసాయిదా ఓటర్ల జాబితాపై ఏవైనా అభ్యంతరాలుంటే డిసెంబర్ తొమ్మిదో తేదీ వరకు అభ్యంతరాలను స్వీకరించనున్నట్లు తెలిపారు. ఏపీలో మొత్తం ఓటర్లు 4,01,53,292 మంది ఉండగా ఇందులో పురుషులు 1,98,31,791, మహిళలు 2,03,85,851 మంది ఉన్నారు. అనంతపురం జిల్లాలో అత్యధికంగా 19,79,775 ఓటర్లు ఉండగా అల్లూరి సీతారామరాజు జిల్లాలో అత్యల్పంగా 7,40,857 ఓటర్లు ఉన్నారు.

**మార్చిలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం..**

రాష్ట్రంలో సాధారణ ఎన్నికల నిర్వహణకు మార్చిలో నోటిఫికేషన్ వచ్చే అవకాశం ఉందని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముకేష్‌కుమార్ మీనా తెలిపారు. డిసెంబరు 9 వరకు ఎవరైనా తమ అభ్యంతరాలు తెలిపితే.. డిసెంబరు 26 లోగా వాటిని పరిష్కరిస్తామన్నారు. ఆ తర్వాత తుది ఓటర్ల జాబితాను 2024 జనవరి 5న ప్రకటిస్తామన్నారు. ఓటర్ల జాబితాపై రాజకీయ పార్టీలు కొన్ని అభ్యంతరాలు తెలిపాయని.. సుమారు 10 లక్షల బోగస్ ఓట్లను గుర్తించి తొలగించామని.. ఈ ప్రక్రియ నిరంతరం కొనసాగుతుందన్నారు.

**అక్రమాలకు పల్పడితే చర్యలు..**

ఓటర్ల జాబితా సవరణల విషయంలో ఎవరైనా అక్రమాలకు ప్రయత్నించినట్లు తమ దృష్టికి వస్తే కచ్చితంగా చర్యలు తీసుకుంటామన్నారు. పర్చూరు నియోజకవర్గం పరిధిలో ఓటర్ల జాబితా తయారీలో పోలీసు సిబ్బంది జోక్యం చేసుకున్నట్లు ఆరోపణలు రావడంతో చర్యలకు ఆదేశించామన్నారు. ఎన్నికల సంఘానికి ఆన్‌లైన్ ద్వారా ఫిర్యాదు అందినా కచ్చితంగా స్పందిస్తామన్నారు. 2023 జనవరి 1 నాటికి 18 ఏళ్ల వయసు నిండిన వారెవరైనా ఓటరుగా నమోదయ్యేందుకు గతంలో దరఖాస్తు చేసుకోపోతే డిసెంబరు 9 వరకు దరఖాస్తు చేసుకునే వీలుంది అన్నారు. 2024 ఏప్రిల్ 1 లేదా జులై 1 లేదా అక్టోబరు 1 నాటికి 18 ఏళ్లు నిండేవారెవరైనా కూడా ముందస్తు దరఖాస్తు చేసుకోవచ్చని తెలిపారు. మార్గదర్శకాలు పాటించని ఎన్నికల రిటర్నింగ్ అధికారులు, ఎన్నికల జాబితా తయారీ అంశంలో జోక్యం చేసుకునే పోలీసుల పైనా చర్యలు తీసుకుంటామన్నారు. పోలింగ్ కేంద్రం అధికారులు, జిల్లా ఎన్నికల అధికారులపై కూడా చర్యలు తప్పవన్నారు. తాజా ముసాయిదా ప్రకారం పెరిగిన ఓటర్లు 2,36,586 మంది 2023 ఓటర్లజాబితా తొలగించిన ఓట్లు 13,48,203.

**చంద్రగిరి నియోజకవర్గంలోనే ఓటర్ల పెరుగుదల..**

ఎన్నికల సంఘం విడుదల చేసిన ఓటర్ల జాబితా ముసాయిదా ప్రకారం రాష్ట్రంలో తిరుపతి జిల్లా చంద్రగిరి నియోజకవర్గంలోనే ఓటర్ల పెరుగుదల ఎక్కువగా ఉంది. చంద్రగిరిలో జనవరిలో విడుదల చేసిన జాబితాతో పోలిస్తే ఏకంగా 12,051 మంది ఓటర్లు పెరిగారు. ఏప్రిల్ 15 నుంచి ఈ నియోజకవర్గంలో కొత్తగా ఓటర్ల నమోదు కోసం 34,015 దరఖాస్తులు, తొలగింపునకు 13,368 దరఖాస్తులు వచ్చాయి. తిరుపతి నియోజకవర్గంలోనూ ఓటర్ల సంఖ్య భారీగానే పెరిగింది. ఇక్కడ 6,230 మంది ఓటర్లు పెరిగారు.

## కమలదళంలో
# సంచలనం ఏదీ?

- చేరికల్లేవు.. బీజేపీ నుంచే వెళ్తున్నారు
- అభ్యర్థుల ఎంపికపై నాన్చుడు..
- జనసేనతో కొన'సాగు తున్న చర్చలు'
- మేనిఫెస్టో రూపకల్పనలో జాప్యం
- అంతా గోప్యమే.. అగమ్య గోచరమే
- అలసత్వమా.. ఫెయిల్యూరా..
- బీజేపీలో పెరిగిన అంతర్గత సమస్యలు



హైదరాబాద్, ఆంధ్రప్రభ: తెలంగాణ బీజేపీలో అలసత్వం రాజ్యమేలుతోందా..? అధిష్టానం ఫెయిల వుతోందా...? అసలు సమస్య ఎక్కడుంది...? ఎందు కు సరైన సమయంలో మేనిఫెస్టో, అభ్యర్థుల ఖరారు చే యడంలో విఫలమవుతోందా...? ఇవే ప్రశ్నలు ఇప్పు డు రాష్ట్ర ప్రజల్లో జరుగుతోన్న చర్చలో కీలకమ వు తున్నాయి. తెలంగాణ అసెంబ్లి d ఎన్నికలు దగ్గర పడుతున్న కొద్దీ బీజేపీ పార్టీలో సరికొత్త సంచలనాలు చోటు చేసుకుంటున్నాయి. పలువురు సీనియర్లు కాంగ్రెస్ బాట పడుతున్న పరిస్థితి ఉన్నా బీజేపీలో చలనం లేద నే చర్చ సాగుతోంది. మరోవైపు బీజేపీజనసేన పొత్తు ఖరారయ్యే ఫైనల్ స్టేజ్‌లో శుక్రవారం రెండో జాబితా ప్రకటించింది. ఊహించని రీతిలో ఒకే ఒక అభ్యర్థితో జాబితా విడుదల చేసింది. తొలి జాబితాలో 52 మందిని ప్రకటించిన తర్వాత తీవ్ర అసంతృప్తులు, అలకలు చోటుచేసుకున్నాయి. రాజగోపాల్‌రెడ్డి కాంగ్రెస్‌లో చేరా రు. ఈ నేపథ్యంలో మలి విడత జాబితాకు పార్టీ కావాలనే జాప్యం చేసినట్లు ప్రచారం జరిగింది.

**నాయకత్వ మార్పు తర్వాత కూడా మారని పరిస్థితి..**

తెలంగాణ బీజేపీలో నాయకత్వ మార్పు తర్వాత కూడా పరిస్థితి మారలేదు. ఇప్పుడు మరింత ఎక్కు వగా అసంతృప్తి పెరిగిపోతోందన్న సూచనలు కనిపిస్తు న్నాయి. నాయకత్వ మార్పు తర్వాత చంద్రశేఖర్, యెన్నం శ్రీనివాసరెడ్డి, తాజాగా రాజగోపాల్‌రెడ్డి వంటి వారు పార్టీ మారిపోయారు. ఇటీవల జరుగుతున్న మార్పులతో మరికొంత మంది సీనియర్ నేతలు కూ డా మండిపోతున్నారన్న ప్రచారం జరుగుతోంది. రాష్ట్ర బీజేపీలో నివురుగప్పిన నిప్పులా పరిస్థితి ఉం దని.. ఎప్పుడైనా బద్దలు కావొచ్చునన్న ఆందోళన ఎక్కువగా కనిపిస్తోంది. అయితే బీసీ కార్డును నమ్ము కున్న బీజేపీ తొలి జాబితాలో బీసీలకు 17మందికి చోటు కల్పించింది. అయినా పరిస్థితిలో మార్పు రాలేదు. జనసేన పొత్తుతో మరి కొందరు పార్టీ వీడుతారనే ప్రచా రం జరుగుతోంది. జనసేన 20 సీట్లకు పట్టుబడుతున్నట్లు తెలుస్తోంది. గతంలో 32 సీట్లలో పోటీ చేస్తామని జనసేన ప్రకటించిన సంగతి తెలిసిందే. తాజాగా శేరిలింగంపల్లి, కూకట్‌పల్లి, ఖమ్మం, నల్గొం డ జిల్లాలోని సరిహద్దు నియోజకవర్గాలను కోరు తోందని సమాచారం.

**వలస నేతలతోనే...**



బీజేపీలో మొదటి నుంచి ఉన్న నేతలకు ఆ తర్వా త వివిధ పార్టీల నుంచి వచ్చి చేరిన నాయకులకు మధ్య ఆదిపత్య పోరు పెరుగుతోందన్న అనుమానాలు వ్యక్త మవుతున్నాయి. అయితే ఈటల రాజేందర్‌కు ఇటీవల పార్టీలో ప్రాధాన్యత పెంచారు. ఆయన తీసుకునే నిర్ణయాలపై అ భ్యంత ర ం చెప్పేందుకు ఇతర నేతలు సిద్ధం గా ఉంటున్నారని అంటున్నారు. అదే సమయంలో కేసీఆర్‌ను గద్దె దించేందుకు ప్రత్యామ్నాయంగా బీజేపీ లో చేరితే, ఇప్పుడు రెండు పార్టీల మధ్య ఉన్న రహస్య అవగాహనతో తమ లక్ష్యం నెరవేరడం లేదని మరి కొందరు ఆరోపిస్తున్నారు. ఇదే పార్టీలో కొనసాగితే కేసీ ఆర్‌కు వ్యతిరేకంగా పోరాడలేమన్న అభిప్రాయంలో ఇంకొందరున్నారు.

**చేరికల్లో వైఫల్యం...**

బీజేపీలో చేరికల కమిటీ చైర్మన్‌గా బాధ్యతలు నిర్వహించిన ఈటల రాజేందర్ బీఆర్ఎస్ నుంచి భారీ ఎత్తున చీలికలు తెచ్చి, నేతల్ని బీజేపీలోకి తీసుకొస్తారని ఆశించారు. అలాంటిదేం అక్కడ జరక్కపోవడంతో ఈటలపై పార్టీ పెద్దలు కూడా నమ్మకం కోల్పో తున్నారు. ఇటీవల ఖమ్మం సభలో ఇరవై రెండు మంది బీఆర్ఎస్ ముఖ్య నేతలు పార్టీలో చేరుతారని ప్రచారం చేశారు. కానీ.. ఒక్కరు కూడా చేరలేదు. దీంతో ఆయ నకు ఇవ్వాల్సిన దాని కంటే ఎక్కువ ప్రాధాన్యం ఇస్తున్నారన్న చర్చ జరుగుతోంది. ఈటల రాజేందర్ వ్యవ హారం బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు కిషన్‌రెడ్డికి ఇబ్బం దికరంగా మారినట్లు పార్టీలో చర్చ జరుగుతుంది. అంబర్‌పేట నియోజకవర్గానికి చెందిన మాజీ మంత్రి సి.కృష్ణయాదవ్‌ను బీజేపీలోకి తీసుకొచ్చేందుకు ఈ టల రాజేందర్ పూర్తిస్థాయి కసరత్తు చేశారు. కృష్ణయాదవ్ కూడా ఆగస్టు 30న బీజేపీలో చేరుతున్నానని ప్రకటించారు. దానిలో భాగంగా హైదరాబాద్ సిటీలో తనతో పాటు ఈటల రాజేందర్, మోడీ, అమిత్‌షా, నడ్డాల ఫొటోలతో భారీ ఎత్తున ప్లెnక్సీలు ఏర్పాటు చేశా రు. పార్టీలో చేరేందుకు అన్నీ సిద్ధం చేసుకున్నాక, అనూహ్యంగా బీజేపీ రాష్ట్ర అధ్యక్షుడు, కేంద్రమంత్రి జీ కిషన్‌రెడ్డి అడ్డుపడ్డారు. తన నియోజకవర్గంలో తనకు సమాచారం లేకుండా కృష్ణయాదవ్‌ను పార్టీలోకి ఎలా తీసుకుంటారని ఆయన ఈటలతో వాగ్వివాదానికి దిగి నట్టు తెలిసింది. అదే రోజు ఉదయం మాజీ గవర్నర్ చెన్నమనేని విద్యాసాగరరావు కుమారుడిని కాషా యకండువా కప్పి కిషన్‌రెడ్డి పార్టీలోకి సాదరంగా ఆహ్వానించారు. అక్కడ తుల ఉమకు వేములవాడ టిక్కెట్ ఇప్పిస్తాననే హామీతో ఈటల రాజేందర్ తనతోపాటు బీజేపీలోకి తెచ్చారు.

**కీలక నేతలు కాంగ్రెస్ లోకి అనే ప్రచారం...**

యెన్నం శ్రీనివాసరెడ్డి తాను కాంగ్రెస్‌లో చేరు తున్నట్లుగా ప్రకటించారు. మరికొంత మంది సీని యర్ నేతలు కూడా అదేబాటలో ఉన్నారని ప్రచారం జోరందుకుంది. తనతో పాటు ఈటల రాజేందర్, కోమ టిరెడ్డి రాజగోపాల్‌రెడ్డి, వివేక్, రవీంద్రనాయక్ వంటి నేతలమంతా కలిసి కాంగ్రెస్‌తో చర్చలు జరిపామని యెన్నం చెబుతున్నారు. పార్టీలో చేరతామని చెప్పిన కొందరు మాట తప్పారనీ, తాను మాత్రం కాంగ్రెస్‌లో చేరుతున్నాననీ స్పష్టం చేశారు. సీఎం కేసీఆర్‌ను బీజేపీలో ఉంటే ఎదుర్కోలేమనీ, ఉద్దేశ్య పూర్వకంగానే బీఆర్ఎస్‌కు బీజేపీ లోపాయికారి సహకారాన్ని అందిస్తున్నదనీ ఆరోపించారు. రోజులు గడిచే కొద్దీ.. బీజేపీలో పరిసితి మరింత దిగజారిపోతున్నదన్న అభి ప్రాయం వినిపిస్తోంది. ఇదిలా ఉండగా పొత్తుల పేరు తో అభ్యర్థుల ప్రకజనలో జాప్యం ఈ పార్టీకి మరిన్ని ఇబ్బందులు తెచ్చి పెడుతోంది.

## ఘాటెక్కిన
# ఉల్లిగడ్డ..

- టమాట ధరలూ పెరుగుతాయంటున్న వ్యాపారులు
- నింగినంటిన నిత్యావసర ధరలు
- గగ్గలో పెడుతున్న సామాన్య జనం
- ఢిల్లీలో కూరగాయల ధరలు మరీ ఘోరం
- హైదరాబాద్‌లోనూ పెరుగుతున్న రేట్లు
- దిగుబడి తగ్గడమే కారణం

ఇప్పటికే నిత్యావసరాల ధరలు ఆకాశాన్నంటడంతో సాధారణ, మధ్యతరగతి ప్రజలు చుక్కలు చూస్తున్నారు. వాటికి ఉల్లిగడ్డ ధర కూడా తోడవడంతో వంటింట్లో పొయ్యి వెలిగించాలంటే ఆలోచిస్తున్నారు. మొన్నటిదాగా కిలో రూ.20నుంచి30 పలికిన ఉల్లిగడ్డ ధర ఇప్పుడు ఏకంగా రూ.80కి చేరింది. ఈ రోజు ఐదు కిలోలకు రూ.350 పలుకుతోందని ఢిల్లీలోని ఘాజీపూర్ కూరగాయల మార్కెట్‌లోని ఓ ఉల్లిగడ్డ వ్యాపారి చెప్పారు. నిన్న అది రూ.300లుగా ఉంది. అంతముందు రోజు రూ.200గా ఉండేదని తెలిపారు. వారం రోజులుగా ఉల్లిగడ్డ ధరలు పెరుగుతూ వస్తున్నాయి. ఉత్పత్తి తక్కువగా ఉండటమే దీనికి కారణమంటున్నారు వ్యాపారులు.

**మరింత పెరిగే అవకాశం..**

రానున్న రోజుల్లో ఉల్లిగడ్డల ధరలు మరింత పెరిగే అవకాశం ఉందని మరో వ్యాపారి చెప్పారు. నవరాత్రి ముందు రూ.50గా ఉన్న కిలో ఉల్లిగడ్డ ధర ఇప్పుడు రూ.70 చేరిందన్నారు. తమకే రూ.70కి పడుతుండటంతో వినియోగదారులకు రూ.80కి అమ్ముతున్నామని చెప్పారు. గతంలో కిలోకు రూ.30 నుంచి 40 మధ్య ఉందన్నారు. ఇది ఇలాగే కొనసాగితే కిలో రూ.100కు చేరుతుందని తెలిపారు. ఉల్లిగడ్డతోపాటు టమాట ధరలు కూడా పెరుగుతున్నాయని ఆయన అన్నారు. గతంలో కిలోకు రూ.20గా ఉన్న టమాట.. ప్రస్తుతం రూ.40 నుంచి 45 పలుకుతుందని చెప్పారు. ఇలాగే పెరుగుతూపోతే రూ.70 వరకు చేరే అవకాశం ఉందని తెలిపారు.




## కాంగ్రెస్ టికెట్ కోసం నితిన్ ప్రయత్నం..
# హ్యాండిచ్చిన రేవంత్ రెడ్డి



ఎన్నికల్లో సినీ గ్లామర్ ఎప్పటి నుంచో ఉంది. ఏపీ, తెలంగాణ నుంచి ఎంతో మంది రాజకీయాల్లో ఉన్నారు. ప్రత్యక్ష ఎన్నికల్లో పోటీ చేసి.. అసెంబ్లీకి కూడా వెళ్లిన వారు కూడా ఉన్నారు. ఐతే తాజాగా తెలంగాణ ఎన్నికల్లో హీరో నితిన్ పేరు కూడా వినిపిస్తోంది. కాంగ్రెస్ టికెట్ కోసం ఆయన తీవ్రంగా ప్రయత్నించారట. ఐతే అది తన కోసం కాదు.. మేన మామ కోసం..! హీరో నితిన్ మేనమామ నగేష్ రెడ్డి చాలా కాలంగా కాంగ్రెస్ పార్టీలో ఉన్నారు. నిజామాబాద్ రూరల్ నుంచి ఆయన టికెట్ ఆశించారు. నితిన్ కూడా తన వంతు ప్రయత్నం చేశారు. కానీ చివరకు నిజామాబాద్ రూరల్ టికెట్‌ను మాజీ ఎమ్మెల్సీ భూపతిరెడ్డికి కేటాయిస్తూ.. శనివారం విడుదల చేసిన రెండో జాబితాలో పేర్కొంది. కాంగ్రెస్ పార్టీ విడుదల చేసిన రెండో జాబితాపై నితిన్ మేనమామ నగేష్ రెడ్డి సంచలన వ్యాఖ్యలు చేశారు. దాదాపు 30 ఏళ్లుగా తాను కాంగ్రెస్ పార్టీలో ఉన్నానని.. ఐనా సరైన గుర్తింపు దక్కలేదని వాపోయారు. పార్టీని నమ్ముకున్న వారికి న్యాయం జరగడం లేదని.. కాంగ్రెస్ ఇక ఎదగదని విమర్శించారు. బయటకు వెళ్లిపోదాం అనుకున్నవారికి టికెట్లు ఇస్తున్నారని.. తన లాంటి వారికి మొండి చెయ్యి చూపారని దుయ్యబట్టారు. లాబీయింగ్‌లకు తలొగ్గి టికెట్లు కేటాయించారని ఆరోపించారు నగేష్ రెడ్డి.